# ప్రేమలేని సాధనలు సారములేని ఫలములే!

ఎద్ది లేదనుచుంటిమో అద్ది కలదు
ఎద్ది కలదనుచుంటిమో అద్ది లేదు
ఉన్నదొక్కటె దైవంబు యెన్నటికిని
లేనిదయ్యెను విశ్వంబు కానరయ్య

ప్రేమస్వరూపులారా!

'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' వాక్కుచేతగాని, మనసుచేతగాని వర్ణించుటకు వీలులేనిది దైవత్వము. అప్రమేయుడు, దైవము. ఎట్టి ప్రమాణములకు దొరకనివాడు. అద్వితీయుడు, దైవము. 'ఏకోహం బహుస్యాం' అని కేవలం తన సంకల్పమాత్రముచేతనే అనేకరూపములు ధరించుచున్నాడు. అనేకరూపములు ధరించిన దైవత్వమును గుర్తించేనిమిత్తమై తానే ప్రజలకు కర్మ, భక్తి, ఉపాసన మార్గములద్వారా 'తత్త్వమసి' అనే విజ్ఞానముచేత తనను తెలుసుకోమని బోధిస్తూ వచ్చాడు. అనేకత్వములో వుండిన యేకత్వమును గుర్తించమని బోధించాడు. దృశ్యకల్పితమైన జగత్తంతయు తనయొక్క ప్రతిబింబమనే సత్యాన్ని గుర్తించమని బోధించాడు.

**తనను తాను గుర్తించుకోవటమే నిజమైన ఆనందము**

కానీ మానవుడు తన స్వస్వరూపాన్ని తాను మరచి, దేహేంద్రియములే తానుగా భావించి, ఆ దేహేంద్రియములయొక్క సుఖ, సంతోషముల నిమిత్తమై తాను అనేక విధములైన పెడమార్గములకు పాలుపడుతూ వచ్చాడు. ప్రపంచములోని ప్రతి మానవుడుకూడను యేదో ఒక విధమైన మార్గములో ఆనందమును పొందాలని ఆశిస్తూ వస్తున్నాడు. ఇట్టి ఆనందమును పొందే నిమిత్తమై అహోరాత్రములు తాను ఆరాటముతో

sri sathyasaivachanamrutam

పోరాటము సలుపుతూ వున్నాడు. కానీ, అట్టి పవిత్రమైన ఆనందానికి నోచుకోలేకపోతున్నాడు. కారణమేమిటి? 'ఆనందము యెక్కడ వున్నది? దాని స్వరూపస్వభావములు యేమిటి? అనే విషయాన్ని గుర్తించుకొనలేక ఆనందము, ఆనందమని చెప్పి మూర్ఖమైన విశ్వాసముచేత వుంటున్నాడు. నిజానికి ఆనందమును ఆశించటమే ఒక తప్పుమార్గము. ఆనందము దృశ్యకల్పితమైన ఈ జగత్తునందుగాని, వస్తువాహనాదులయందుగాని, భోగభాగ్యములయందుగాని, దారాపుత్రాదుల యందుగాని కనుపించదు. ఏ ఆనందాన్ని మానవుడు ఆశిస్తున్నాడో, అభిలషిస్తున్నాడో ఆ ఆనందమే తన స్వరూపమైనప్పుడు యింక ఆనందము వేరుగా యెక్కడ కనుపిస్తుంది? అనగా తనను తాను గుర్తించటమే నిజమైన ఆనందము. తనను తాను తెలుసుకొనటమే నిజమైన ఆనందము. ఈనాటి మానవుడు అన్నియు తెలుసుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. కాని, తనను తాను తెలుసుకొనుటకు యేమాత్రము ప్రయత్నించటంలేదు. అన్నిటినీ చూడగల్గుతున్నాడు. తనను తాను చూడలేకపోతున్నాడు. దీనికి కారణమయేమిటి? జగత్తునందు రెండవపదార్థము మరొకటి వున్నదనుకొనటమే దీనికి మూలకారణము.

చూచుచున్న దృశ్యమంతయు దైవమైనప్పటికి దైవాన్ని చూడలేదని వాపోతున్నాడు, అజ్ఞానుడైన మూర్ఖుడు. చూచునదంతయు దైవమే! చూడబడునదంతయు దైవమే! చూపులు దైవమే! ఈ త్రిపుటితత్త్వాన్ని యేకత్వముగా భావించుకున్నప్పుడే మానవత్వంలో నిజమైన ఆనందము ఆవిర్భవిస్తుంది. అయితే మానవుడు అంతులేని, హద్దులేని ఆశలకు గురి అవుతున్నాడు. మానవుని కోరికలకు యేమాత్రము అదుపులేదు. చీమలపుట్టలవలె పెరిగిపోతున్నాయి, ఆశలు. ఈ ఆశలతో తృప్తిపడుతున్నాడా? కోరికలతో ఆనందమును అనుభవిస్తున్నాడా? అనుభవించుకొలది యీ కోరికలు మరింత అధికమవుతూనే వున్నవి కాని, యేమాత్రము క్షీణించటానికి పూనుకోటంలేదు. యీ కోరికలకు అంత్యమెక్కడ? ఈ కోరికలవల్ల మానవునికి లభించే ఫలితమేమిటి? నిజానికి, ఈ కోరికలవల్ల ఆనందమునకు బదులు కేవలము అనర్థములే జరుగుతున్నాయి. సుఖమునకు బదులు దుఃఖము ప్రాప్తిస్తూ వస్తుండాది. కోరికలకు రూప, నామములు లేవు. ఇవి భ్రాంతిచేత ఆవిర్భవించే భ్రమలే.

srisathyasaivachanamrutam

## అనేకత్వమును ఏకత్వముగా భావించుటే బ్రహ్మతత్త్వము

మానవునియందు యీ భ్రమలు వుండినంతవరకు బ్రహ్మ కనుపించదు. భ్రమలు నిర్మూలమైనప్పుడే బ్రహ్మ నిర్మాణమౌతాడు. ఈ బ్రహ్మ తత్త్వమేమిటి, భ్రమతత్త్వమేమిటి? ఏకత్వాన్ని అనేకత్వముగా పెంచుకోటమే భ్రమతత్వము. అనేకత్వమును యేకత్వముగా భావించటమే బ్రహ్మతత్త్వము. సర్వత్రావున్నది బ్రహ్మయే. అట్టి బ్రహ్మతత్త్వాన్ని గుర్తించుటకై ఋషి మానససంచారి, బ్రహ్మ మానసపుత్రుడైన నారదుడే అనేక విధములైన భ్రమలకులొంగి, యీ భ్రమలు తొలగించుకొనే నిమిత్తమై బ్రహ్మప్రాప్తి నిమిత్తమై సనత్కుమారుని ప్రార్థించాడు. 'నాయనా నీవు వచ్చిన పని యేమిట'ని ప్రశ్నించాడు, సనత్కుమారుడు. 'స్వామీ బ్రహ్మానందమును నేను అనుభవించాలి, భ్రమతత్త్వాన్ని గుర్తించాలి. బ్రహ్మను చూడగలిగాలి. ఇలాంటి ప్రాప్తి నాకు అనుగ్రహించమని' కోరాడు. అయితే 'యీ పవిత్రమైన ఫలితము అందుకొనుటకై నీకు వున్న అర్హతలు యేమిట'ని ప్రశ్నించాడు సనత్కుమారుడు. నాలుగు వేదములను, ఆరుశాస్త్రములను పరిపూర్ణముగా అధ్యయనంచేసి వ్యాఖ్యానము గావించే శక్తిని నేను సాధించానన్నాడు. దీనికి సనత్కుమారుడు చిరునవ్వు నవ్వి 'యింకా యేమైనా నీకు తెలుసునా' అని ప్రశ్నించాడు. సర్వగమ్యములకు మూలమైన, సర్వమునకు కీలకమైన, సర్వశాస్త్రములకు ఆధారమైన ఆ పరతత్త్వమునే గుర్తించినప్పుడు యింక బ్రహ్మతత్త్వములో వుండిన మర్మము యేమిటని ప్రశ్నించాడు, నారదుడు. దానికి సనత్కుమారుడు 'నాయనా! యిన్ని తెలిసికూడను నీవు యీ బ్రహ్మతత్త్వాన్ని గుర్తించుకోలేనప్పుడు, బ్రహ్మను దర్శించుకోలేనప్పుడు దీనికున్న కారణము యేమిటో యోచించమ'న్నాడు. 'మానవుడు యెంతటి ధీశక్తి కలవాడైననూ, ధీశక్తితోగాని, యుక్తులతోగాని లేక శాస్త్రములతోగాని దైవత్వాన్ని పొందలేరు. దీనికంతయు భక్తియే మూలము. భక్తితో నీవు భగవంతుని ప్రార్థించు తప్పక సాక్షాత్కరిస్తాడ'ని బోధించాడు, సనత్కుమారుడు.

## పరిపూర్ణ ప్రేమకే భగవంతుడు లభ్యమవుతాడు

ఈనాటి మానవులకు యుక్తి, ధీశక్తి మితిమీరిపోతున్నవి. ఈ యుక్తులచేతగాని,

srisathyasaivachanamritam

ధీశక్తులచేతగాని, పాండిత్యముచేతగాని భగవంతుని యేమాత్రము పొందలేరు. కేవలము ఒక నిర్మల నిశ్చల నిస్వార్థమైన భక్తి ప్రపత్తులకు మాత్రమే భగవంతుడు లభిస్తాడు. పరిపూర్ణ ప్రేమకే భగవంతుడు లభ్యమౌతాడు. కనుక, యీనాడు మనము అభివృద్ధి గావించుకోవలసినది పరిపూర్ణ భక్తి. కేవలము కష్టసమయములందు, విచారములయందు మాత్రమే భగవంతుని స్మరించి ఆనంద, సంతోష, సౌఖ్యసమయములందు భగవంతుని విస్మరించటము కాదు. 'యద్భావం తద్భవతి' అని యెట్టి హృదయముతో భగవంతుని ప్రార్థిస్తామో, యెట్టి భావముతో భగవంతుని చింతిస్తామో అట్టి ఫలితమే మనకు లభిస్తుంది. Part time భక్తిలో మనము ప్రయత్నము చేయటము Full time ప్రేమను ఆశించటము యిది సాధ్యముకాదు. 'నీవేతప్ప నితఃపరంబెరుగ' అని సర్వకాలములయందు, సర్వావస్థలయందు భగవంతుని చింతన చేసి సర్వము భగవత్ ప్రీత్యర్థముగా అంకితము గావించుకునే స్థితికి మనము రావాలి.

**ప్రాచీన సంప్రదాయ, సంస్కృతులను సంరక్షించి అనుసరించటమే భక్తి, ప్రపత్తులు**

ఈనాడు యజ్ఞయాగాది క్రతువులు మనము ఆచరిస్తున్నాము. దీనియొక్క అంతరార్థమేమిటి? సర్వత్రా నిండిన భగవంతుని భక్తిమార్గములో ఒక్కొక్క విధానముచేత మనం గమ్యాన్ని చేరటమే! ఈ భక్తికి నవ విధ మార్గములుంటున్నాయి.

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

ఇన్నిమార్గములయందు యే ఒక్క మార్గమునైనా పరిపూర్ణమైన విశ్వాసముతో, పరిపూర్ణమైన ప్రేమతో మనము ఆచరించినప్పుడు తప్పక దివ్యమైన దైవత్వాన్ని మనము చూడగలము, అనుభవించగలము. కనుక, దైవత్వాన్ని పొందటానికి ఒక్క ప్రేమయే ప్రధానమైన రాజమార్గము. అయితే, పవిత్రమైన గ్రంథములు చదువనక్కరలేదని చెప్పటంలేదు. గ్రంథములు చదువవచ్చు. పెద్దలయొక్క సువాక్యములు శ్రవణము చేయవచ్చు. కాని చదివినంత మాత్రమున, విన్నంతమాత్రమున ప్రయోజనములేదు. ఏ ఒక్కటి రెండైనను ఆచరణలో వుంచినప్పుడే అవి సార్థకమౌతాయి. యీనాడు

sri sathyasai vahini amrutam

మానవత్వములో ఒక విచిత్రమైన వికారము అభివృద్ధి అవుతున్నది. ముఖ్యముగా అహంకార, అభిమానములు మితిమీరిపోవుచున్నవి. అహంకారమనేది వుండినంతవరకు ఆత్మదర్శనము మనకు యేమాత్రము కాదు. అహంకారమును నిర్మూలనము గావించాలి. అసూయను చేరనివ్వకుండా చూచుకోవాలి. ఇతరులయొక్క ఆనందమును, యితరులయొక్క సౌఖ్యమును చూచి అనేకమంది చాలా బాధపడుతూ వుంటారు. అలాంటివారికి యేమాత్రముకూడను సద్గతి ప్రాప్తించదు. ఇతరులయొక్క ఆనందమే తన ఆనందముగా విశ్వసించాలి. నిత్యజీవితములో వుండిన సత్యమార్గమును మనము అనుసరించటంలోపలనే సరైన భక్తి, ప్రపత్తులు యిమిడి వుంటున్నవి. నిత్యసత్యముగా ప్రకాశించు ప్రాచీన సాంప్రదాయములను, సంస్కృతిని కాలానుగుణ్యముగా సంరక్షించి దానిని సరైన మార్గములో అనుభవించటమే యీనాటి ప్రధానమైన భక్తి, ప్రపత్తి.

**అద్వైతస్థితికి రానంతవరకు ఆత్మతత్త్వము అర్థముకాదు**

సాంప్రదాయములను మనము సరైన రీతిలో పోషించుకోవాలి. మనయొక్క సంస్కృతిని మనము కాపాడుకోవాలి. జీవితములో సమగ్రతను పోషించుకోటమే మన సంస్కృతి ప్రధానలక్ష్యము. ఈ సమగ్రతను వికసింపచేసుకోటమే సరైన సంస్కృతి. భగవద్గీతలో 18వ అధ్యాయమునందు 61వ శ్లోకములో కృష్ణుడు తన ఉనికిని, తన యథార్థస్వరూపాన్ని నిరూపిస్తూవచ్చాడు. 'ఈశ్వర సర్వభూతానామ్', సర్వ భూతములయందు వుండిన వాడను నేను అని ఉద్ఘాటించాడు. కేవలము యేదో ఒక జీవియందు మాత్రమేకాదు! ఎవరిని దూషించినా భగవంతుని దూషించినట్టే, ఎవరిని విమర్శించినా భగవంతుని విమర్శించినట్లే! ఎవరిని ప్రేమించినా భగవంతుని ప్రేమించినట్టే! ఈ పవిత్రమైన విశ్వాసమును మనము అభివృద్ధి గావించుకోవాలి. కాని, అట్టి విశ్వాసము లేక దైవము తనకంటే వేరుగా వున్నాడు అనే ద్వైతభావాన్ని పెంచుకుంటూ పోయేకొలది మన జీవితము అధోగతి పాలవుతుంది. జీవితమంతయు ద్వైతభావమునందే మనము వ్యర్థము గావించరాదు. పూజలు చేయవలసినదే, జపములు ఆచరించవలసినదే, జ్ఞానము ఆర్జించవలసినదే! కానీ యెంత కాలమైనా వీటినే ఆశ్రయించి వుండకూడదు. ఉన్నతమైన స్థాయికిపోవాలి. కర్మనుంచి

srisathyasaivachanamrutam

ఉపాసన, ఉపాసననుంచి జ్ఞానమును చేరాలి. ద్వైతమునుండి విశిష్టాద్వైతము, విశిష్టాద్వైతమునుండి అద్వైతములో మనము ప్రవేశించాలి. అట్టి అద్వైతస్థితికి రానంతవరకు ఆత్మతత్త్వమును యేమాత్రముకూడను మనము అర్థము చేసుకోలేము. బైరాగిశాస్త్రిగారు చెప్పారు, 'స్వామిని తెలుసుకోవాలంటే స్వామి కావాల'ని. 'ఎవరియొక్క మంచి చెడ్డలు వారికి మాత్రమే తెలుస్తుంది గాని పరులకు తెలియదు' అనికూడను చెప్పాడు. యితరులెరుగకున్న ఈశ్వరుండెరుగడా? ఇతరులకు తెలియకుండా వుండవచ్చుగానీ, ఇతరులకు దాచి పెట్టవచ్చుగాని దైవానికి దాచి పెట్టేది కాదు. కనుక, దైవమునుండి దాచటానికి ప్రయత్నించడమనేది ఒక మూర్ఖత్వము, ఒక ద్రోహము! ఎట్టి తప్పునకైనా పరిహారమున్నదిగాని, దైవమునుండి దాచడానికి ప్రయత్నించినవానికి పరిహారములేదు. దైవముముందు సర్వము భక్తిభావముతో అర్పితము గావించాలి. మనయొక్క జీవితము వున్నతమైన, పవిత్రమైన గమ్యము చేరటానికి తగిన మార్గము వెతకాలి. ఎంతకాలమునుండియో ఆత్మతత్త్వాన్ని, బ్రహ్మతత్త్వాన్ని గురించి మనము శ్రవణము చేస్తున్నాము, మననము చేస్తున్నాము. కాని నిధి ధ్యాస చేయటములేదు. ఎంతకాలమైనాకూడను మనము దేహభ్రాంతితో దీనిని భ్రమలో వుంచి మనముకూడను తద్వారా అశాంతికి గురికారాదు.

**నిత్యానందము, అద్వైతానందమును అనుభవించుటకు సరైన మార్గము భగవత్ప్రేమను పెంచుకొనుటయే!**

క్రమక్రమేణా దేహేంద్రియభావాన్ని మరచిపోతూరావాలి. అదుపులో పెట్టుకొనుటకు ప్రయత్నించాలి. ఇది అదుపులేనంతవరకు మనకు ఆనందము ప్రాప్తించదు. ఈనాడు మనము అనుభవించేటి అనుభవమంతయు కేవలము క్షణభంగురమైనది. కేవలము క్షణికమైన ఆనందమును మనము అనుభవించలేము. ఇది కేవలము విషయానందమే. ఈ ఆనందముయొక్క పర్యవసానము దుఃఖమే. దీనితో ఆనందమును మనము అనుభవించలేము. నిత్యానందమును, అద్వైతానందమును అనుభవించుటకు సరైన మార్గము భగవంతునియొక్క ప్రేమనే! మనము శాస్త్రములు అభ్యసించవచ్చును, వేదములు



sri sathyasai vahini

పఠించవచ్చును, పురాణములు చదువవచ్చును. కాని, అన్నింటియందువుండిన సారాంశమైన దైవప్రేమను అభివృద్ధిపరచుకొనకుండిన యివన్నియు నిరుపయోగమైనవిగా రూపొందుతాయి. ప్రేమలేని సాధనలన్నియు సారములేని ఫలములే! దైవమునకు ఒకరియందు ఆగ్రహము, వేరొకరియందు అనుగ్రహము లేవు. భగవంతుడు యేదిచేసినా, యేదిచెప్పినా, యేది తలచినా భక్తులయొక్క ఆనందము నిమిత్తమే! లోకకళ్యాణము నిమిత్తమై తాను సంకల్పిస్తూవుంటాడు. దైవతత్త్వమును గుర్తించటానికి చక్కగా ప్రయత్నించాలి. ఒక్కొక్క సమయములో దైవము ఆగ్రహించినట్లుగా మీరు తలంచవచ్చును. ఆది చాలా పొరపాటు. మీరు తప్పు మార్గములో పోవుచున్నారనే భావముచేత కొంత తాను ఆగ్రహిస్తాడు. అట్టి సత్యాన్ని మీరు గుర్తించక అనేకరకములైన అపోహలకు గురియై అశాంతిని పొందుతున్నారు. అద్దము పరిశుద్ధముగా వుండినప్పుడే మన ప్రతిబింబము పరిశుద్ధముగా కనిపిస్తుంది. అద్దము మాలిన్యముతోకూడినప్పుడు మన ప్రతిబింబముకూడను మాలిన్యముగానే వుంటుంది. సమస్త కర్మలు భగవంతునియొక్క ప్రేమరసాన్ని మన హృదయమునందు అనుభవించటానికి తగిన చిత్తశుద్ధిని మాత్రమే చేకూర్చకలుగుతున్నాయి. 'చిత్తస్యశుద్ధయే కర్మ,' కనుక మనము చేసే సర్వకర్మలు చిత్తశుద్ధితో ఉండాలని త్రికరణశుద్ధిగా మనము భగవంతుని ప్రార్థించాలి. మనసు ఒకవైపున, యింద్రియములు మరియొకవైపున, సంకల్పములు యింకొకవైపున పోతూవుంటే ప్రయోజనములేదు. సంగీతమునకు రాగతాళభావములు యెంత అవసరమో భగవంతుని ప్రార్థనయందు యీ త్రికరణశుద్ధి అంత అవసరము. శృతి తప్పితే మనము అపశృతిలో పడిపోతాము. ఇది శ్రవణానందముగా వుండదు. తాళము తప్పుతే మన మనస్సు భ్రమించి పోతుంది. రాగము తప్పితే మరి రోగమే వస్తుంది. ఇవన్నీ వేరు వేరుగా వుంటుంటే భగవంతునికి అసంతృప్తి కలిగిస్తాయి. అయితే, భగవంతునికి తృప్తి అసంతృప్తి అని రెండులేవు. మిమ్ములను తృప్తిచేసే నిమిత్తమై తాను అసంతృప్తిని నిరూపిస్తూవుంటాడు. మిమ్ములను సరిచేసే నిమిత్తమై తాను అసంతృప్తిని ప్రకటిస్తూవుంటాడు.

**ఎవరి సొత్తును వారికందించటమే త్యాగము**

sri sathyasai vachanamrutam

మనము యేది చేసినప్పటికిని త్రికరణశుద్ధిగా చేయటానికి తగిన కృషి చేయాలి. ఈనాడు ప్రపంచములో దానము, ధర్మము, త్యాగము అనే పవిత్ర పదములు మనము ఉచ్చరిస్తున్నాము. కానీ దురదృష్టవశాత్తు ధర్మము, జ్ఞానము, త్యాగమునకు మనము అనేక విధములైన అపార్థములు కల్పిస్తున్నాము. ఇది సరైనది కాదు. త్యాగము అనగా యేమిటి? నీకేదో ఒకటి వుండినప్పుడు దానిని త్యాగము చేసి భగవంతుని ప్రార్థిస్తున్నామనికాదు. త్యాగమంటే అదికాదు. ఎవరి సొత్తును వారికందించటమే త్యాగము. ఎవరో వచ్చి దానమడిగారు. అతనికి ధనమిచ్చాము. కాని అది త్యాగము చేసినట్లుగా మనము భావిస్తున్నాము. కాదు కాదు. అతని ధనమే అతనికి యిస్తున్నాము. అది యెప్పుడో యేనాడో నీ చేతికి అందించాడు. ఆ విధంగా అందించకుండా వుండిన వ్యక్తి అయితే నీ దగ్గరకు వచ్చి ధనాన్ని ఆశించలేడు. కానీ అతని ధనాన్ని అతనికి అందించటానికి కూడ మనం వెనుకంజ వేస్తున్నాము. అలాంటివాడు అప్పులు ఎగవేయటానికి ప్రయత్నం చేసే వానిగా వుంటాడు. అదే విధముగ జ్ఞానధనమును భగవంతునినుండి అందుకుంటాము. అతనినుంచి అందుకున్న ధనము తిరిగి అతనికే అర్పితము గావించాలి. కనుకనే పరమభక్తులైనవారు

**ఏ హృదయంబు నొసగితివో ఈశ నాకు**
**మగిడి దానినే యర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేమి తెత్తు నీ పాదార్చనకును**
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు**

అన్నారు. ఏది నీవు యిచ్చావో దానినే నీకు యిస్తున్నాను. నేను కొత్తగా సంపాదించినది కాదు.

**విషయవాంఛలను తగ్గించుకుని దైవవాంఛలను పెంచుకోవటానికి ప్రయత్నించండి**

విద్యార్థులారా! ఈనాడు యువకులైనవారు అనేక విధములుగా పెడమార్గములు పట్టి పవిత్రమైన దివ్యజీవితాన్ని అపవిత్రం గావించుకుంటున్నారు. ఎనుబది నాలుగు లక్షల జీవరాసులయందు మానవునికి వుండిన కోరికలు యే జీవికిలేవు. పశుపక్ష్యాది, రాక్షసాదులకుకూడను కోరికలకు కొంత హద్దు వుంటున్నాది. కాని, 'జంతునాం నరజన్మ

దుర్లభం', అనే పవిత్రమైన సార్థక బిరుదునందుకొన్న మానవులకు మాత్రం రాక్షసులకంటే మితిమీరిన కోరికలుంటున్నాయి. పశుపక్ష్యాదులకంటె మితిమీరిన కోరికలుంటున్నాయి. ఈ కోరికలవలననే సుఖాన్ని, ఆనందాన్ని అందుకోవలసిన, అందించవలసిన మానవుడు, అశాంతిని, దుఃఖమును అనుభవిస్తున్నాడు. కనుక, విషయ వాంఛలను తగ్గించుకొని దైవవాంఛలను పెంచుకోటానికి ప్రయత్నించండి. జగత్తుయొక్క భ్రాంతిని క్రమక్రమేణా మీరు తగ్గించుకుంటూరండి. వైరాగ్యమనగా వస్తువాహనాదులను విసర్జించటమే కాదు.

**భావమందు దుష్టభావంబు వీడుటే**
**త్యాగమగును అదియె యోగమగును**
**ఆస్తియాలివీడి యడవికేగుటకాదు**
**సత్యమైన బాట సాయిమాట**

కనుక, మనము మొట్టమొదట దుష్టభావాన్ని అరికట్టాలి.

## ధర్మము దైవ స్వరూపము

ఆత్మసాక్షాత్కారం యెంత అవసరమో ఆత్మశిక్షకూడ అంత అవసరం. ఈనాడు మనకు దుష్టభావములు వచ్చినాయి అనుకోండి! 'ఛీ! యీ దుష్టభావములంతా ఆహారవిహారములచే వచ్చినవి. కనుక, నేడు ఆహారమును భుజించను. దీనికి యిదే సరియైన శిక్ష', అని మనము కొంత గట్టిగా మనసు నిగ్రహించుకొని తద్వారా దానిని శిక్షించటానికి సంసిద్ధులు కావాలి. కానీ మానవునియందు ఒక బలహీనత అభివృద్ధి అవుతూ వస్తున్నాది. తప్పులు చేయటము, యిదంతా మానవుని స్వభావమని అనుకోటం! దోషములు చేయటము మానవులకు సహజమని భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు! నిజానికి, దోషములు చేయటము, తప్పులు ఆచరించటము మానవునియొక్క స్వభావమే కాదు. ఈ విధముగా మానవస్వభావమని అనుకుంటూపోతే యిది మరింత మితిమీరిపోతుంది. దోషములు చేయటము దుష్టుల లక్షణము. దుష్టులెవరు? దానవులు! దుష్టభావములతోకూడినవారు దానవులు. రజోగుణ మిళితమైనవారు దానవులు. మనము రాక్షసులముకాదు. కనుక, ఈ దోషములను యేమాత్రముకూడను మనము క్షమించరాదు. దోషములు మన స్వభావము



srisathyasaivachanamrutam

కాదు. ప్రేమయే మన స్వభావము. సత్యమే మన స్వరూపము. ధర్మమే మన స్వధర్మము. మనలను ఆవరించినదే ధర్మము. ఈ ధర్మము త్యాగముతో కూడినప్పుడే యిది ఒక యోగమవుతుంది. ఈ ధర్మము రాగముతో కూడినప్పుడు కేవలము యిది కర్మలకు బంధితమవుతుంది. ధర్మమందు యేమాత్రము మనము మర్మమును చేర్చుకోరాదు. ధర్మమైనప్పటికిని మర్మముతో చేరటమువల్ల యిది కర్మగారూపొంది తత్ఫలితమును మనము అనుభవించవలసి వస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. ధర్మజుడు ధర్మస్వరూపుడే, ధర్మమయుడే, ధర్మమూర్తియే! కానీ కృష్ణాజ్ఞను పురస్కరించుకొని 'అశ్వత్థామ హతః' అని పైకి గట్టిగా పలికి, 'కుంజరః' అని మర్మం పెట్టాడక్కడ. కొంచెం తక్కువ స్థాయిలో చెప్పాడు. ఈ మర్మమును అందులో చేర్చటంచేతనే ధర్మజుడు కొంతకాలమైనాకూడను నరకమును అనుభవించాడు. అనగా ఆ మర్మముయొక్క కర్మయే యితని అనుభవానికి కారణము. కనుక, ధర్మములో యెట్టి మర్మమును చేర్చరాదు. ధర్మము దైవస్వరూపము. 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నంత మాత్రమున యిది చాలదు. ఆ ధర్మాన్ని మనము ఆచరణలో వుంచాలి. ఆనందముతో అనుభవించాలి.

**దుష్ట భావములు నాకు అందించి నా మంచి భావములు నీవందుకో!**

ఈనాడు మనము భక్తులము, భక్తులము అని అనుకుంటున్నాము. భక్తులకు వుండవలసిన లక్షణములు యేమిటి? అవి మనలో వున్నవా? స్వామికి సర్వము అర్పితము గావించామనుకుంటున్నాము. సర్వము అర్పితము గావించివుంటే యింక రాగద్వేషములు యెక్కడనుంచి వచ్చాయి? దుష్టభావములు నాకందించి నా మంచి భావములు నీవందుకో! దీనికి సరియైన సాధన చెయ్యాలి. ఆ దుష్టభావములు నా దగ్గర వుంటుంటే అవి దుష్టమార్గములో ప్రవేశించలేవు. ఇవే నీ దగ్గర వుంటుంటే నిన్ను హింసిస్తాయి. సర్కస్‌లోపల ఫ్రెండ్ అయిన వాని దగ్గరనే ఏ పులో, సింహమో వుంటే అవి వానిని యేమీ చేయవు. కానీ యింకొక వ్యక్తి దగ్గరకు పోయిందంటే వానిని శిక్షిస్తుంది. దుష్టభావములన్నియు క్రూరమృగముల వంటివి. ఈ క్రూర మృగములన్నింటికి శిక్షణనిచ్చేవాడు దైవము. అతనే Master, Masterకు అంకితము చేయండి. అతని

srisathyasaivachanamrutam

అదుపులో అవి వుంటాయి. కానీ అదుపు తప్పి నీలోపల వాటిని వుంచుకుంటే అవి నిన్ను చాలా క్షీణింపచేస్తాయి.

ఈనాడు మానవుడు వుండవలసిన స్థితులు, చేయవలసిన కార్యములు తెలుసుకోటానికి మొట్టమొదట ప్రయత్నించాలి. ఎవ్వరిని మనము నిరుత్సాహపరచటానికి ప్రయత్నించరాదు. ఎవరి మనసుకూడను నొప్పించటానికి పూనుకోరాదు. సాధ్యమైనంతవరకు నీలో నీవు నిగ్రహించుకొని నీవు తృప్తిపడి, యితరులను తృప్తిపరచే మార్గమును వెదకాలి. ఇతరుల విషయాన్ని గురించి మనము అనేకముగా తర్కించుకుంటూ లేక వాదించుకుంటూ, విమర్శించుకుంటూ వుండటం చాలా చెడ్డ కార్యము. 'బ్రహ్మ సత్యం జగత్ మిథ్య' అని వుంటున్నాది. అయితే, ప్రత్యక్షముగా గోచరమయ్యే యీ జగత్తును యే విధముగా మిథ్య అని చెప్పటానికి వీలవుతుంది? ఈ జగత్తులో సమస్త అనుభవములు మనము అనుభవిస్తున్నాము. త్రిగుణములతో మనము అనుభవిస్తున్నాము. ఏ ఉద్దేశ్యముతో శంకరులు ఈ జగత్తును అసత్యమని, మిథ్య అని చెప్పారు, అనే వాదన సలుపుకుంటూ తనకు తృప్తి కలుగక నా దగ్గరకు వచ్చాడు, ఒకాయన. "స్వామీ! బ్రహ్మ సత్యం జగత్ మిథ్య అన్నారు. ఏది సత్యము యేది నిత్యము?" అని ప్రశ్నించాడు; అందుకు నేను "బ్రహ్మను వదలు, మిథ్యమైన జగత్తును వదులు, మొట్టమొదట నీవు సత్యమా కాదా విచారించుకో"మన్నాను. "ఈ జగత్తును పట్టుకొని, బ్రహ్మను పట్టుకొని యేమి ప్రయోజనము? మొట్టమొదట నిన్ను నీవు సత్యమా కాదా అని నిర్ణయించుకో! నీవు బ్రతికినంతకాలము నీవు సత్యమనే అనుకుంటున్నావు. చావువరకు పోనక్కరలేదు. రాత్రి నిద్రలో నీవు లేవు. నిద్రయందే లేనప్పుడు అందలి అనుభవము సత్యమా నిత్యమా? నీవు వుండినట్లు తెలియదు. చచ్చినట్లు తెలియదు. అది చావు కాదు, బ్రతకటము కాదు. సత్యము కాదు, అసత్యము కాదు. ఇట్టి సదసత్తుల చేరికయే నిత్యము. కనుక, నిన్ను నీవు తెలుసుకో! నీవు మిథ్య అయినప్పుడు జగత్తంతా మిథ్యయేను", అన్నాను.

**మనోనాశనముచేత బాధలు తగ్గుతాయి**

ఇంకొకడు అతనితోనే వచ్చాడు. 'స్వామీ! ఈ రకమైన జీవితాన్ని జీవించే బదులు

sri sathyasai vachanamrutam

ఆత్మహత్య చేసుకోటం మంచిది', అన్నాడు. 'ఆత్మహత్య అంటే యేమిట'ని ప్రశ్నించాను. 'నాకు అనేక విధములైన సందేహములు, అనుమానములు చాలా పీడిస్తున్నాయి', అన్నాడు. "అయితే పీడించేవి యేమిటి? నీ సంకల్పములా లేక నీ మనోభావములా? సంకల్పములయొక్క చేరికయే మనసు. మనసు యీ విధమైన కృత్రిమములచేత నిన్ను బాధిస్తున్నాది. ఆత్మహత్య అనగా దేహమునకు గావించే దానినే ఆత్మహత్య అని ఈనాడు భావిస్తున్నారు. నిజానికి, ఆత్మ యెట్టి దోషములు చేయటములేదు. దానినెందుకు నీవు హత్య చేస్తావు? నీ అశాంతికి మూలకారణము మనస్సే! కనుక, మనసును హత్యచేయి. మనసును నాశనము చేసుకో, నీకు బాధలు తగ్గుతాయి. అట్లుకాకుండా మనోబాధలకు, దేహానికి శిక్షనిస్తే యేదైనా అర్థముందా? దోషము చేసేది ఒకటి, శిక్ష అనుభవించేది మరొకటి. సమస్త విచారములకు మనసే కారణము. మనసును శిక్షించటానికి ప్రయత్నము చేయండి. కానీ దేహాన్ని శిక్షంచటానికి ప్రయత్నించటము అధర్మమవుతుంది. ఒకరు తప్పు చేస్తే జడ్జి యింకొకరికి punishment యిస్తే యిది న్యాయమవుతుందా? ఇక్కడ శిక్షించేది దేహమును. అందువలన మరింత పాపానికి గురి అవుతావ"ని చెప్పాను. 'క్షమించండి, క్షమించండి స్వామీ!' అన్నాడు. ఈ విధముగనే వుంటున్నది, మానవలోకము. నిత్యానిత్యవిషయ పరిశీలన చేసే జ్ఞానము వారిలో శూన్యమైపోతుండాది. తెలివితేటలు పెరిగిపోతున్నాయిగాని, గుణము తరిగిపోతున్నాది. కనుక తెలివితేటలు కాదు మనకు ప్రధానము. పవిత్రమైన గుణము మనకు ఆధారము. గుణమునుబట్టే మన స్థానము వుంటుంది. దైవస్థానములో వుండుటకు దైవగుణాన్ని పెంచుకోవాలి.

దీనిని ప్రయత్నపూర్వకంగా మీరు సాధించటానికి పూనుకోండి. క్రమక్రమేణా పవిత్రమైన గుణములు మీ హృదయములో భద్రము చేసుకోటానికి వీలవుతుంది. పాత్రలో యేమేమో నింపుకొని మంచి పదార్థములు దానిలో నింపుకోవాలంటే అది వీలుకాదు. మొట్టమొదట ఆ పాత్రను ఖాళీ చేయండి. తరువాత పవిత్రమైన భావాలను దానిలో నింపుకోటానికి ప్రయత్నము చేయండి.

**దుర్బుద్ధులు తలనున్న- దూరులు విను చెవులున్న**

sri sathyasai vachanamrutam

**పొంచిచూచు కనులున్న- పంచలు విను చెవులున్న**
**వంచిత గుణ చిత్తమున్న - వంచించే మనసున్న**
**ఈ వికృతులు చూడగనే - దేవుడక్కడ నిలువడన్నా**

కనుక, యీ వికృతులను దూరము చేసుకున్నప్పుడే దేవుడక్కడ నివసిస్తాడు. దేవుని హృదయమునందు నిలుపుకోటానికి యివన్నీ మనము పారద్రోలాలి. ఇదే నిజమైన ఆరాధన. ఈ ఆరాధనచేతనే ఆధేయమైన దైవత్వమును అనుభవించి, ఆనందించు. ఆనందమును పెంచుకొని పదిమందికి పంచు.

**(తేదీ 27-09-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam